మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# పకడ్బందీగా కంటి వెలుగు కార్యక్రమం

◆ జిల్లాలో కంటి వెలుగు విజయవంతంగా నడుస్తుంది

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏ ఒక్కరు దృష్టి లోపంతో బాధపడకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం మహబూబ్‌నగర్ జిల్లాలో విజయవంతంగా నడుస్తుంది. వైద్య బృందాలు, డాక్టర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషి, సమన్వయంతో కంటి వెలుగు వైద్య శిబిరాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను ప్రభుత్వం రెండో విడత కంటి వెలుగు వైద్య శిబిరాలు నిర్వహణకు ఆదేశించిన మరుసటి రోజు నుండే జిల్లాలో పక్కా ప్రణాళిక తయారు చేయడమే కాకుండా, ప్రణాళికను తూ.చ. తప్పకుండా అమలు చేయడం, నిరంతర పర్యవేక్షణ, రోజువారి సమక్షలు, విశ్లేషణ వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాలతో ఎప్పటికప్పుడు లోటుపాట్లను సవరించుకుంటూ ఇంకా రోజు రోజుకు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఆయన ఆదేశాల మేరకు జిల్లాలోని సర్పంచ్ మొదలుకొని అందరు ప్రజా ప్రతినిధులు అదేవిధంగా వైద్యారోగ్యశాఖతో పాటు, అన్ని శాఖలఅధికారులు కూడా పూర్తి స్థాయిలో కంటివెలుగు నిర్వహణలో భాగస్వాములై కార్యక్ర మాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. జిల్లాలో 441 గ్రామ పంచాయతీలు, 86 మున్సిపల్ వార్డులలోని 18 సంవత్సరాల పైబడిన వారందరికి వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగు తుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో నారాయణ పేట జిల్లాను కలుపుకుని మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమంలో 7 లక్షల 51 వేల మందికి పరీక్షలు నిర్వహించడం జరిగింది. లక్ష 49 వేల మందికి కళ్లద్దాలను పంపిణీ చేయడం జరిగింది. రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం సందర్భంగా జిల్లాలో మొత్తం జనాభా 1067836 ఉండగా, 18 సంవత్సరాలు పైబడిన వారు 6,94,093 మంది ఉన్నారు. ఇప్పటి వరకు 44 వేల 264 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. 17 మంది ట్రాన్స్‌జెండర్‌లకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. 7647 మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేయ డం జరిగింది. 5267 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలను ఇచ్చేందుకు గుర్తించనైనది. 31322 మందిని ఎలాంటి కంటి దోషాలు లేనివారిని గుర్తించడం జరిగింది. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్... దృష్టిలోపంతో బాధపడుతూ డబ్బులు ఖర్చుపెట్టి చూయించుకోలేని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేదలు ఏ ఒక్కరు కూడా దృష్టి లోపంతో బాధపడకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ తానే పెద్దన్నయి, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇదొక అద్భుత కార్యక్రమం. మన అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమం దేశం లోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శమైంది. రాష్ట్ర ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వారికున్న దృష్టిలోపాలను సవరించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను, రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా కంటి వైద్యపరీక్షలు చేయడమే కాకుండా కళ్లద్దాలను కూడా ఉచితంగా పంపిణీ చేస్తు న్నది. కంటి వెలుగు వైద్య శిబిరాలలో ప్రజ లకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాము. వైద్య పరీక్షలకు వచ్చే వారికి ఎక్కువ సమయం తీసుకోకుండా వైద్యులు దగ్గరుండి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అవసరమైన విధంగా సేవలు అందిస్తున్నారు. అందువల్ల జిల్లాలోని ప్రజలు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జనవరి 9న జిల్లాస్థాయి కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. నిర్దేశించిన ప్రణాళిక ప్రకా రం జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నాము. ఇందుకు వైద్యా ధికారులు, మండలాల స్పెషలాఫీసర్లు, అదే విధంగా వైద్యారోగ్యశాఖ అధికారులు, కంటి వెలుగు వైద్య బృందాలు చాలా బాగా పని చేస్తున్నారు. ఇదే స్ఫూర్తిని చివరి వరకు కూడా కొనసాగించి వంద రోజుల కంటి వెలుగు కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో విజయవంతంగా చేస్తాము. ముఖ్యంగా ముందుగా తయారు చేసుకున్న పకడ్బందీ ప్రణాళిక ప్రకారం పంచాయతీ కార్యదర్శి మొదలుకొని అందరు ఇళ్లిళ్ల తిరిగి ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలను చైతన్యం చేస్తు న్నారు. దృష్టి లోపంతో బాధపడుతున్న వారిని కంటి వెలుగు వైద్య శిబిరాలకు తీసుకువచ్చి వారికి ఉచితకంటి వైద్య పరీక్షతో పాటు, కంటి అద్దాలు కూడా పొందే విధంగా చర్యలు తీసుకుం టున్నారు. కంటి వెలుగు వైద్య శిబిరంపై ఇటు ప్రజా ప్రతినిధులు, అటు అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నందువల్లే జిల్లాలో కంటి వెలుగు వైద్య శిబిరాలు విజయవంతం అవుతున్నాయి. కంటి వెలుగు నిర్వహణపై ప్రతి రోజు నివేదికలను తెప్పించుకోవడంతో పాటు ఎక్కడైన లోపాలుంటే అప్పటికప్పుడే సరిచేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. అంతేకాక ప్రతిరోజు అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం,విశ్లేషణ చేయడం చేస్తున్నాము.ప్రజల నుండి కూడా కంటి వెలుగు వైద్య శిబిరాలకు మంచి స్పందన ఉంది.





రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్



జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు

## గార్లపాడు గ్రామ కొత్త బ్రిడ్జిని త్వరలో పూర్తి చేయిస్తా

● అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం



**ఇటిక్యాల,జనవరి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా నుండి మారమునగాల గ్రామానికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న ఆర్అండ్‌బి బ్రిడ్జి నిర్మాణాన్ని కాంట్రాక్టర్, అధికారులతో మాటాడి త్వరగా పూర్తి చేయించేందుకు చూస్తానని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆదివారం మండల పరిధిలోని రాజశ్రీ గార్లపాడు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 5 లక్షల రూపాయలతో చేపట్టే సిసిరోడ్డు నిర్మాణాన్ని, అలాగే మరో 5 లక్షల రూపాయలతో మైనార్టీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 8 ఏళ్లలో ముఖ్యమంత్రి కెసిఆర్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యం, తాగునీరు,సాగునీరు అంతేకాక గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గార్లపాడు గ్రామంలో అభివృద్ధి కోసం ప్రాధాన్యత కల్పించానని, దళితబంధు పథకం కింద గ్రామంలోని నిరు పేదలను గుర్తించాలని స్థానిక అధికార పార్టీ నాయకులకు సూచించారు. అలాగే సొంత ఇంటి స్థలం ఉన్నవారికి ప్రభుత్వం ఇల్లు కట్టుకునేందుకు రూ. 3 లక్షలు ఆర్థిక సహాయం చేస్తుందని విడతల వారిగా ఇంటి బిల్లు మంజూరు అవుతుందని గ్రామస్తులకు ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించాలని, అలాగే పునరావాస కొత్త గార్లపాడు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయున్ని నియమించాలని ఎమ్మెల్యేను కోరారు. సంబంధిత విద్యాశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పునరావాస కొత్త గార్లపాడు గ్రామానికి ఉపాధ్యాయున్ని నియమించేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్‌బి బ్రిడ్జి నిర్మాణాన్ని కాంట్రాక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పూర్తి చేసేలా చూస్తామని గ్రామస్తులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పద్మమ్మ, ఎంపిటిసి మల్లేష్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు డా. అజయ్, జడ్పీటిసి రాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రాముడు, సుంకన్న, మల్లన్న, మధునాయయుడు, ఈదన్న, బారాసా పార్టీ నాయకులు యుగంధర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, హుసేన్, సూరి, వేణుగోపాల్‌నాయుడు, ఈదన్ననాయుడు, మహ్మద్ హుసేన్, లాలూ, భాష తదితరులు పాల్గొన్నారు.

## బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



**మల్దకల్,జనవరి 29 ప్రభాతవార్త:** నియోజవర్గంలోని మల్దకల్ మండల పరిధిలోని బూడిదపాడు, అమరవాయి, నాగర్‌దొడ్డి, కుర్తిరావులచెరువు గ్రామంలో కోటి 30 లక్షల వ్యయం తో బిసి,ఎస్సీ కమ్యూనిటి హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం, నోట్‌పుస్తకాలు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కమ్యూనిటి హాల్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కొరకు అనేకమైన పథకాలు ప్రవేశపెట్టి నేరుగా ప్రజలు లబ్ది పొందే విధంగా కృషి చేయడం జరుగు తుందన్నారు. ప్రభుత్వం ఎన్నోసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలు లబ్ది పొందే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా అన్ని కులాలను గౌరవిస్తూ వారికి పూర్వవైభవం వచ్చే విధంగా ప్రతి ఒక్కరు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా అహర్నిశలు ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా సీఎం కెసిఆర్‌తో ప్రత్యేకంగా నిధులు కేటాయించుకుని ప్రతి గ్రామంలో పేద ప్రజలు వివాహ,శుభకార్యాలు జరుపుకోవడానికి కమ్యూనిటి ఫంక్షన్ హాల్‌ను ఏర్పాటు చేయ డం జరుగుతుందన్నారు. ప్రతిఇంటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రైతుబంధు, 24 గంటల కరెంటు, రైతుభీమా, గ్రామంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఇంటింటికి మంచినీళ్లు,ఆసరా పింఛన్ వంటి పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. 40 ఏళ్ల అధికారం అప్పగిస్తే ఆపద సమయంలో పారిపోయారన్నారు. పక్క రాష్ట్రంలో తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు కర్ణాటకలో ఎందుకు లేవో బిజెపి నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపిపి రాజారెడ్డి, జడ్పీటిసి ప్రభాకర్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ ఎంపిపి వీరన్న, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటన్న, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ సవారన్న, కో ఆప్షన్ మెంబర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారాంరెడ్డి, విక్రమ్‌సింహారెడ్డి, చక్రదర్‌రెడ్డి, తూమ్ కృష్ణారెడ్డి, శేషంపల్లి నర్సింహులు, అజయ్, నరసింహారెడ్డి, భాస్కర్, ఎల్లప్ప, నారాయణ, ఆంజనేయులు, నరెంరద్, మధునాయకి, జనార్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మహ్మద్ అలీ, ఆంజనేయులు, భాస్కర్‌గౌడ్, తిమ్మరాజు, పరశురాముడు, యువ నాయకులు ప్రవీణ్,మహేష్,కిరణ్,నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో జంతర మంతర్ వద్ద భూనిర్వాసిత రైతుల సమ్మె

**గద్వాల టౌన్,జనవరి 29 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగమైన చిన్నోనిపల్లి రిజర్వాయర్ ప్యాకేజీ నంబర్ 101 కింద రద్దు కొరకై గత సంవత్సర కాలంగా సమ్మె చేస్తున్న రైతులు కృష్ణా రివర్ బోర్డుకు గతంలో ప్రధానమంత్రికి మా లేఖ పంపించామని దీని విషయమై మరలా ప్రదానమంత్రికి తెలియజేయడానికి చిన్నోనిపల్లి రిజర్వాయర్ ఐదు గ్రామాల భూనిర్వాసిత రైతులు జనవరి 29వ తేదీన ఢిల్లీకి బయలుదేరారు. ఢిల్లీలో భారతదేశ ప్రధానమంత్రికి కేంద్ర జలశక్తి కేంద్రశాఖ మంత్రికి, కృష్ణా రివర్‌బోర్డు కలిసి ఈ చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను రద్దుచేసి రైతులపట్టా భూములు 2464 ఎకరాలు రైతులకు ఇవ్వాలని తెలంగాణ ప్రజలమైన మాకు బచావత్ కమిటి నుండి కేటాయించబడిన 15.9 టిఎంసిల నీళ్లను ఆర్డీఎస్ పొలానికి పారించి అక్కడి రైతులకు న్యాయం చేస్తూ తెలంగాణకు వ్యతిరేకమైన ఈ చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను రద్దు చేసి రైతులకు అప్పగించాలని విజ్ఞప్తి చేయనున్నారు. ఈ విషయంలో ప్రధానమంత్రి సానుకూలంగా స్పందించి మా ఐదు గ్రామాల రైతులను ఆదుకుని మాకు ప్రధానమంత్రికి రైతులు, ప్రజలు మనవి చేసుకుంటున్నారు.




# ఇసుక..బకాసుర



● అక్రమ ఇసుక తరలింపు పై అధికారుల అలసత్వం
● ఇసుక డంపుల నిల్వలపై దాటవేత సమాధానాలు
● ప్రకృతి సంపద పక్కదారి పట్టించుకోని వైనం
● అధికార యంత్రాంగం మొద్దు నిద్ర

**ఖిల్లాఘణపురం,జనవరి29 ప్రభాతవార్త:** మూడు పువ్వులు, ఆరుకాయలు అనే చందంగా ప్రకృతి సహజసిద్దంగా వర్షాల వల్ల వస్తున్న ఇసుక మేటలు పర్వతాలు, గుట్టలు ఇష్టరీతిగా త్రవ్వకాలు జరు పుతూ భారీ వాహనాల్లో ఇసుక మట్టి తరలిస్తూ ఇసుక బకాసురులకు కాసుల వర్షం కురిపిస్తున్న అధికార యంత్రాంగం దాటవేత సమాధా నాలతో కాలయాపన చేస్తూ ప్రకృతిసంపదను కొల్లగొట్టే వారితో భారీ వాహనాలతో రాత్రి పగలు తేడాలేకుండా ఇసుకను మట్టిని ఎల్లలు దాటిస్తుందని మండలంలో విమర్శలు వెల్లువెత్తు న్నాయి. ఇండ్ల నిర్మాణ యజమానులకు తట్టెడు ఇసుకను అవసం ఉన్న అధికారులకు నిబంధనలు గుర్తుకొస్తాయి కానీ ఇసుక బకాసు రుని అడుగతే నిబంధనలు తుంగలో తొక్కి వెనువెంటనే అనుమతులు ఇసుక తరలించే ట్రాక్టర్ల చెంతకు చేరుతున్నాయి. మండల పరిధిలోని వాగుల పరిసర ప్రాంతాల్లో ఇసుక డంపులు ఏర్పాటు చేస్తున్న కంటికి కనబడనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రతి పక్ష బీజేపీ పార్టీ నాయకులు సాక్షాదారాలతో పట్టిస్తే అధికారుల వ్యవహారశైలితో పలు అనుమానాలకు దారితీస్తుంది డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో కోట్లాది రూపాయల విలువచేసే ఇసుకను తరలిస్తున్నారని వాగుల పరిసర ప్రాంతాల ప్రజలు పలు మార్లు ఇసుక రవాణాను అడ్డుకున్నారు.మండల పరిధిలోని కమలుద్దీన్‌పూర్ గ్రామపంచాయితీ పరిధిలోని కొత్తపల్లి వాగులో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ ఇసుక డబుల్ బెడ్ రూమ్ ఇసుక పేరుతో ఇసుకను తరలిస్తూ ప్రజల అవసరాల గురించి పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారని పరిసర గ్రామాల ప్రజలు పలుమార్లు ఇసుక తరలిం పును అడ్డుకున్నా సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాలను పూర్తి చేయల్సిన నాయకులు ఇసుక అక్రమ రవాణా దందాకు ఇష్టరీ తిగా వాగులు, కాల్వలకు వర్షానికి కొట్టుకొచ్చిన ఇసుకపై కన్నులు పడడంతో నిబంధనలకు విరుద్దంగా ట్రాక్టర్లు, టిప్పర్లతో తోడుకున్న వారికి తోడుకున్నంత అనే విధంగా హిటాచీలు భారీ వాహనాల సాయంతో దోచేస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు ఇసుక తరలించడానికి ట్రాక్టర్లు మాత్రమే వినియోగించాలని నిబంధన ఉన్న కనీస మా అధికారులకు అవగాహన లేనట్లుగా ప్రవర్తిస్తున్నారు. వాగుల నుండి ఇసుకను పైకి తరలించి ఇసుక డంపులు నిల్వలు చేస్తూప్రకృతి సంపదను పక్కదారిపట్టిస్తున్నారని ప్రతిపక్ష నాయకులు మొరపెట్టుకుంటున్న పెడచెవిన పెట్టిన అధికార యంత్రాంగం అప్పటికప్పుడు కథనాలు రాస్తూ ఫిర్యాదుదారులకు కల్లోబొల్లి కబుర్తు చెబుతున్నారు. రెండు పడకల ఇండ్ల ప్రభుత్వ పథకం పేరుతో ఇప్పటికే ఇసుకను ఎక్కువ మోతాదులో సేకరించాలని బీజేపీ నాయ కులు ఆరోపిస్తున్నారు. ఇండ్ల నిర్మాణాలు చేపట్టే యజమానులకు ఆన్‌లైన్ ఇసుక దొరకడంలేదని కానీ రాత్రి వేళల్లో ఇష్టారీతిగా బ్లాక్ దందాలో ఇసుక దొరుకుతుందని ఇండకల నిర్మాణాల యజమానులు వాపోతున్నారు. రాబోయే రోజుల్లో మండల పరిధిలో ఇల్లు కట్టుకోవ డానికి సుక దొరకడం కష్టంగా మారుతుందని మండల వాసులు వాపోతున్నారు. వాగుల్లో నీరు పారుతున్న ఇసుక త్రవ్వకాలు జరు పుతూ ప్రధాన రహదారులపై వాహనాలు వెళ్లడం శోచనీయమని ప్రకృతి ప్రేమికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అవసరాలకు మించి ఇసుకను పక్కదారి మల్లిస్తున్నారని విమర్శలు వస్తున్న అక్ర మ ఇసుక తరలింపును అడ్డుకునే వారు లేకుండా పోయారు. అధి కార పార్టీ నాయకుల అండదండలతో ప్రభుత్వ పథకాల పేరుతో ఇసుక అక్రమ రవాణా మండలంలో పెద్దఎత్తున రాత్రిపగలు అనే తేడా లేకుండా జరుగుతుంది. ఇసుక రవాణాపై ఆంక్షలు ఉంటే వెంటనే మట్టి తరలింపుకు తెర తీస్తూ గుట్టలు మింగేసి భూముల అక్రమనకు మార్గం సుగమం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారు లతో చేతులు కలిపి వెంచర్లకు మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి సంపదను పక్కదారి పట్టిస్తూ దోచే కాడికి దోచేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరు చెబుతూ అక్రమ దందాలకు అధికారులు వంత పాడుతున్నారు. ప్రభుత్వ ఆస్థులపై ప్రకృతి సంపదపై అధికారులు పర్యవేక్షణ లోపంతోనే సమస్యలు తలెత్తు న్నాయి. ప్రభుత్వ ఆస్థులు కనుమరుగవుతున్న ప్రభుత్వ అధికారులు మొద్దునిద్ర నటిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మార్పు రాకపోతే రాబోయే కాలంలో ప్రతి ఒక్కరు మూల్యం చెల్లించుకోక తప్పదు.

అక్రమ రవాణాపై చెరవాణిలో తహసిల్దార్ భానుప్రకాష్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



ఇసుకను తరలించడానికి సిద్ధంగా ఉన్న హిటాచి వాహనం



ఇసుక డంపు నిల్వలు

**అక్రమ ఇసుక రవాణా అడ్డుకోవడం అధికారుల బాధ్యత: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబు గౌడ్**



మండల పరిధిలోని అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడం ప్రకృతి సంప దను కాపాడడం అధికారుల బాద్యత లేనని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ తెలిపారు. ఇసుక డంపును నిల్వలను బీజేపీ నాయకులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అవివేకమని అన్నారు. సీజ్ చేసిన ఇసుక డంపులకు టెండర్లు వేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూ ర్చాలన్నారు. అక్రమ ఇసుక రవాణాకు వినియోగించిన వాహనాలపై కేసు నమోదు చేయాలని గుర్తు చేశారు. ప్రకృతి సంపదను ఇష్టారీతిగా తరలిస్తే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతామని అన్నారు. అధికార పార్టీ నాయకుల ఆగడాలకు అధికారులు అడుగులకు మడుగు లోత్తడం బాధాకరమని అన్నారు.




ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్



అక్రమ రవాణాపై తహసిల్దార్ భానుప్రకాష్‌ను నిలదీస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి

## కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా సంఘాల ఐక్యవేధిక సీఐటీయూరైతు సంఘం వ్యవసాయ కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేధిక సీఐటీయూ రైతు సంఘం వ్యవసాయ కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీన దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున కార్మిక వర్గం కదం తొక్కాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ఐక్యవేధిక ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. జిల్లా సదస్సు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ హాజరై మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా రూ.10లక్షల మందితో కేంద్ర ప్రభుత్వంపై సమరశఖం పూరిస్తామన్నారు. మూడు వ్యవసాయ కార్మిక చట్టాలను తీసుకొచ్చి కేంద్ర ప్రభుత్వం రైతుల యొక్క మరణాలకు కారణమైందని గుర్తు చేశారు. నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు విద్యుత్ సవరణ బిల్లు ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపులు 200 పని దినాలు, కనీస వేతనం రూ.600లు నిర్ణయించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.శ్రీనివాసులు, శ్రీనివాసులు, ఆంజనేయులు, శ్రీనివాసులు, రామయ్య, ఈశ్వర్, మల్లేష్, అశోక్, దశరథం, మాసమ్మ, పార్వతమ్మ, వెంకటేశ్వర్లు, మల్లేష్, మహేష్, కళాశతి తదితరులు ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న టి.సాగర్

## రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ..



**వీపనగండ్ల, జనవరి 28 ప్రభాతవార్త:** రైతు సంఘం వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ దగ్గర 2023 రైతు సంఘం నూతన క్యాలెండర్ ను స్థానిక ఎస్ఐ రామన్‌గౌడ్, రైతు బంధు మండల అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్ రెడ్డి లతో పాటు రైతులు పక్షంలో ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ రామన్, రైతు బంధు అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న వ్యవసాయ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నూతన పద్ధతిలో వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ సాగు చేసి లాభసాటిగా ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. రైతు సంఘంజిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని పండించిన పంటలకు మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ సూర్యనారాయణ, రైతు నాయకులు రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, కృష్ణయ్య, ధర్మారెడ్డి, మిద్దె వెంకటయ్య, గోపి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్రలో ఘనంగా రథసప్తమి పర్వదిన వేడుకలు

**వాసవిమాత అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు**



**దేవరకద్ర, జనవరి 28 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం రథసప్తమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాలాది రామ్మోహన్ పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ఆర్యవైశ్యులు ఘనంగా స్వాగతం పలికారు. పర్వదిన వేడుకల సందర్భంగా అమ్మవారికి అర్చకుడు హరిశంకర్‌శర్మ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తీర్థప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిఫిన్ అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. అలాగే అమ్మవారి ఆశిర్వాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గబృందం యువజన సంఘం అధ్యక్షుడు ఎదిర ప్రమోద్‌లతో పాటు దేవస్థానం చైర్మెన్ కల్వకన్నయ్యశెట్టి, గుద్దేటి మంజుల రాణిలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు రూ.3లక్షల వెంటనే పంపిణీ చేయాలి..

**సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందికొండ గీత**




**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఇంటి స్థలం ఉన్న ప్రతి పేదవారికి రూ.3లక్షలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందికొండ గీత అన్నారు. శనివారం పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను వెంటనే పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అదే విధంగా ఇండ్లు లేని ప్రతి పేదవాడికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. డబుల్ బెడ్‌రూం ఇల్ల పేరుతో స్థలాలు ఇచ్చే జీవో రద్దు చేశారని, దానిని వెంటనే పునరద్ధరించాలని కోరారు. ఇండ్లు లేక పేదవాళ్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఆర్.శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మండల కార్యదర్శి అశోక్, కాశన్న, రామయ్య, సత్యనారాయణ, ఈశ్వరమ్మ, జయలక్ష్మి, తారాసింగ్ తదితరులు ఉన్నారు.

## గార్లపాడును మండలంగా ప్రకటించే వరకు పోరాటం

**మండల సాధన సమితి జెఎసి కన్వీనర్ రామునాయక్**



**కోయిల్‌కొండ, జనవరి 28 ప్రభాతవార్త :** గార్లపాడును మండలంగా ప్రకటించే వరకు పోరాటం నిర్వహిస్తామని మండల సాధన సమితి జెఏసి కన్వీనర్ రాము నాయక్, కో కన్వీనర్ వెంకట్రాంరెడ్డిలు అన్నారు. మండలం కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి ఆరోరోజుకు చేరుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ గార్లపాడును మండలంగా ఏర్పాటు చేయాలని ప్రజలలో బలమైన కోరిక ఉందన్నారు. ప్రజల కోరిక మేరకు వెంటనే గార్లపాడును మండలంగా ప్రకటించాలన్నారు. పాలకులు స్పందించి మండలాన్ని ఏర్పాటు చేసి ప్రజల మనసును దోచుకోవాలన్నారు. కోయిల్‌కొండ మండలంలోని సగం గ్రామాలను కలిపి గార్లపాడును నూతన మండలంగా ప్రకటించాలని మండల సాధన సమితి నేతలు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. రిలే నిరాహార దీక్షలో కానాయపల్లి, మల్కాపూర్, గంగ్యానాయక్‌తండా యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గార్లపాడు మాజీ సర్పంచ్ దస్తగిరి, కేశ్వాపూర్‌వార్డు సభ్యులు నరేష్‌చారి, ఆర్ఎంపి డాక్టర్ ఆంజనేయులు, అభంగపట్నం కాంగ్రెస్ నాయకుడు పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ భృతికి బడ్జెట్లో నిధులు కేటాయించాలి..




**వనపర్తి టౌన్, జనవరి 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ తాజా బడ్జెట్లో నిరుద్యోగ భృతికి పెద్దమొత్తంలో నిధులు కేటాయించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ డిమాండ్ చేశారు. శనివారం అమరచింత మండల కేంద్రంలో స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పెట్టిన రైతు రుణమాఫీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితులకు 3ఎకరాల భూమి, ఆసరా పెన్షన్‌లు, ఇంటికో ఉద్యోగం తదితర పలు హామీలకు ప్రతి ఏటా బడ్జెట్లో ఎంతో కొంత నిధులు కేటాయిస్తూ వచ్చారన్నారు. కానీ నెలకు 3016రూ. లు నిరుద్యోగ భృతికి మాత్రం నిధులు కేటాయించలేదని నిరుద్యోగుల ఓట్లు దండుకొని మోసం చేశారని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్‌లో నైనా నిరుద్యోగ భృతికి పెద్దఎత్తున నిధులు కేటాయించి హామీనెరవేర్చాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ తుంగలో తొక్కిందని విమర్శించారు. ఉద్యోగ ఉపాధి హామీ కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. 8ఏళ్ల పాలనలో నిరుద్యోగం, దరిద్రం, ధరలు, ఆకలి పెరుగుతూనే ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో నిరుద్యోగుల ఆగ్రహానికి ప్రభుత్వాల పతనం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు ప్రతాప్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో దొరల పాలనకు ప్రజలే చరమగీతం పాడాలి..

**నారాయణపేట కాంగ్రెస్ అధ్యక్షులు**

**వాకిటి శ్రీహరి, పీసీసీ మాజీ అధికార ప్రతినిధి కేశంనాగరాజు.**

**అమరచింత, జనవరి 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలయ్యాడని రాష్ట్రంలో దొరల పాలనకు ప్రజలే చరమగీతం పాడాలని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి శ్రీహరి, పీసీసీ మాజీ అధికారి ప్రతినిధి కేశంనాగరాజు అన్నారు. శనివారం అమరచింత మండల పరిధిలోని మిట్టనందిమల్ల గ్రామంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 6నుండి చేపడుతున్న హత్ సే హాత్ జోడో పాద యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ మాట నిలబెట్టుకుం టామని, 2లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటు దందని వారు తెలిపారు. రేవంత్ రెడ్డి పాదయాత్ర విజయవంతం చేయడానికి గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తులసిరాజు, ఎస్ఎమ్ అరుణ్ కుమార్, లాల్‌కోట వెంకట్ రెడ్డి, ప్రశాంత్, సత్యం, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

# మన్యంకొండ బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు..

- యుద్ధప్రతిపదిక మీద సెంటర్ లైటింగ్ ఫోర్‌వే బిటి రోడ్డు పనులు
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక చొరవతో ఊపందుకొన్న పనులు
- 31 నండి ఉత్సవాలు ప్రారంభం

**దేవరకద్ర, జనవరి 28 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక చొరవతో దేవస్థానం వద్ద వివిధ పనులు బాగా ఊప దుకొన్నాయి. మంత్రి ఆదేశానుసారం జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మెన్ రాజేశ్వర్‌గౌడ్ ఈ పనులకు సంబందించి సంబందిత అధికారులు, దేవస్థానం సిబ్బందికి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. దీంతో పనులు త్వరగా జరుగడానికి ఆస్కారమేర్పడుతుంది. బ్రహ్మోత్సవాలకు ముహూర్తం దగ్గరపడుతుండటంతో ఉత్సవాల సందర్భంగా చేపట్టే పనులు యుద్ధప్రతిపదిక చేపడుతున్నారు. ప్రతి ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతాయి. అందులో భాగంగానే ఈ నెల 31 నుండి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 18 వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాలలోని ప్రధానఘట్టమైన స్వామి వారి రథోత్సవం ఫిబ్రవరి 5 అర్ధరాత్రి దాటిన తరువాత నిర్వహించనున్నారు. ఈఉత్సవాలకు జిల్లాతోపాటు తెలంగాణ, మహారాష్ట్రల నుండి కొన్ని వేలమంది భక్తులు ఉత్సవాలకు అధికసంఖ్యలో హాజరవుతారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానంవద్ద చేపట్టే వివిధ పనులు చివరదశలో ఉన్నాయి.

**ముమ్మరంగా సెంటర్ లైటింగ్ బిటి ఫోర్‌వే రోడ్డు పనులు..**

మన్యంకొండ వద్ద సెంటర్ లైటింగ్ ఫోర్‌వే బిటి రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. స్టేజి నుండి ఘాటురోడ్డు ప్రారంభంలో ఉన్న కమాన్‌వరకు ఈ పనులు చేపడుతున్నారు. ఈ పనులు కూడ యుద్ధప్రాతిపదికమీద చేపడుతున్నారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఉండటానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేకంగా ఈ రోడ్డు పనులను చేయిస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని మన్యంకొండ ఘాటురోడ్డు పొడవున రోడ్డుకు ఇరుపక్కల రాళ్ళకు జాజుపట్టెలు పెట్టారు. రోడ్డు మలుపుల వద్ద రోడ్డును చదునుచేస్తున్నారు. హెచ్చరిక సూచికలు చేపడుతున్నారు. ఘాటురోడ్డు పొడవున ఎల్ఈడి లైట్లను ఏర్పాటుచేస్తున్నారు. అలాగే హనుమద్దాసుల, దేవస్థానం ముందున్న కోనేరులను శుభ్రపరిచారు. దేవస్థానం వద్ద కొత్త రథమండపాన్ని ఏర్పాటు చేశారు. ఘాటురోడ్డు పై విద్యుత్ లైట్లను ఏర్పాటుచేశారు. దేవస్థానం చైర్మెన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూధన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజుల పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి. దీంతో మన్యంకొండ చూడముచ్చటగా కనిపిస్తుంది.



జరుగుతున్న సెంటర్ లైటింగ్ ఫోర్‌వే బిటి రోడ్డు పనులు



దిగువ కొండ వద్ద భక్తుల స్నానాలకు ఏర్పాటు చేసిన మెట్లు




ఘాటురోడ్డు గోడలకు హెచ్చరిక సూచికలు రాస్తున్న దృశ్యం



మన్యంకొండ వద్ద వెలుస్తున్న దుకాణాలు

**వెలుస్తున్న దుకాణాలు..**

ఉత్సవాలకు సమయం దగ్గరపడుతుండటంతో మన్యంకొండ వద్ద వివిద దుకాణాలు వెలుస్తున్నాయి. దిగువ కొండ, తేరుమైదానంల వద్ద వివిధ రకాల తినుబండారాలతో పాటు వివిధ రకాల దుకాణాలను ఏర్పాట్లు చేస్తున్నారు. తినుబండారాలను వాటి యజమానులు తయారుచేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

## కులమతాలకు అతీతంగా
# సయ్యద్ సుల్తాన్ అలీషా వలీ దర్గా ఉత్సవాలు

**కల్వకుర్తి, జనవరి 28 ప్రభాతవార్త:** కులమతాలకు అతీతంగా సయ్యద్ సుల్తాన్ అలీషా వలీ దర్గా ఊర్సు ఉత్సవాలు నిలుస్తాయని జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, ఐక్యత ఫౌండేషన్ చైర్మన ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిలు అన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో ప్రతి ఏటా ఘనంగా నిర్వహించే సయ్యద్ సుల్తాన్ అలీషా దర్గా ఉత్సవాలు ఘనంగా ప్రారంభయ్యాయి. దర్గా ఉత్సవాలకు జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, ఐక్యత ఫౌండేషన్ చైర్మన ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ఫాతిహా కార్యక్రమంలో పాల్గొని దర్గాపై పూలచద్దర్ ఎక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే సుల్తాన్ అలీషా దర్గా ఉత్సవాల్లో పాల్గొంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నానన్నారు. మొక్కుకున్న మొక్కులు తీరుతాయని భక్తుల విశ్వాసం. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ లక్ష్మీ కళ్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



దర్గా ఉత్సవాల్లో ప్రత్యేక ఫాతిహాలో పాల్గొన్న జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్



అన్నదాన కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

## వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి నియామకం..

**వనపర్తి టౌన్, జనవరి 28 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి ఏఐసీసీ కార్యదర్శి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ డా.జి.చిన్నారెడ్డి, కొల్లాపూర్ నియోజకవర్గ రంగినేని అభిలాషరావు పీసీసీ జనరల్ సెక్రటరీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా శ్రీలత రెడ్డి ని నియమించడం జరిగింది. వనపర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల చందర్, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరు కలిపి మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి కి బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీలత రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా నియమించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికై తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ మాజీ అధ్యక్షుడు డి.కిరణ్ కుమార్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు కమ్మర్ మియా, మత్స్యకార జిల్లా అధ్యక్షుడు యాదయ్య, మున్సిపల్ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, యాదయ్య యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దివాకర్ యాదవ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాబ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ డి.వెంకటేష్, వనపర్తి పట్టణ ఓబీసీ అధ్యక్షులు మన్నెంకొండ, ఎన్‌యుఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్, దిలీప్, నరసింహ, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు చరణ్, మన్యం యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, నాగరాజు, గంధం లక్ష్మయ్య, పాండురవ్. నరేందర్ రెడ్డి, ఎల్లయ్య, రామ్‌రెడ్డి, రాంజీ నాయక్, రవి కిరణ్, చిట్టెమ్మ, లీలావతి, యాదయ్య, రవీందర్, నాగార్జున, రవి సాగర్, గంధం కుమార్, నరేష్, ఆనంద్, షహద బేగం, ప్రతాప్ రెడ్డి, అనిరుద్, పి,మన్యం, చిన్నంబాయి సతీష్ కుమార్, అమర్నాథ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డిని సన్మానిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

## రోడ్ల విస్తరణ పనులు పరిశీలించిన మున్సిపల్
## చైర్మెన్ వాకిటి శ్రీధర్, అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్..

**వనపర్తి ప్రతినిధి, జనవరి 28 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ కొత్త బస్టాండ్ రోడ్డును వెంటనే విస్తరణ చేపట్టాలని షాప్ లు తిరిగి తెలిపారు. రోడ్డు సెంటర్ నుండి 45 సీట్లు మార్కౌట్ ఇవ్వడం జరిగింది. దాని ప్రకారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎవరికి వాళ్లు రోడ్ల విసంతరణ చేసుకోని మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పాత బజార్ యూకో బ్యాంక్ రామ టాకీస్ నుండి రాజీవ్ చౌక్ వరకు రోడ్ల విస్తరణ పనులను పూర్తి చేయడం జరిగిందని వెంటనే మిగిలిపోయిన కొత్తబస్టాండ్ రోడ్, కొత్తకోట రోడ్డు విస్తరణ పనులను వేగం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న షాపుల యజమానులకు రోడ్డు విస్తరణ కు సహకరించాలని విజ్ఞాప్తి చేశారు. వనపర్తి జిల్లా కేంద్రం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని దీనితో పాటు ట్రాఫిక్ విపరీతంగా పెరుగుతుంది కాబట్టి ప్రమాదాలు జరగకుండా ప్రజలందరు బాద్యతగా తీసుకోని రోడ్డు విస్తరణకు సహకరించాలని, స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ విక్రమంసింహారెడ్డి, మున్సిపల్ డిఈ భాస్కర్, ఏపీఎస్ సెక్షన్ సుమన్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, అదనపు జేసీ ఆశీశ్ సంగ్వాన్

# వైభవంగా గంగాపురం బ్రహ్మోత్సవాలు

**జడ్చర్ల, జనవరి 28 ప్రభాతవార్త :** జడ్చర్ల మండల పరిధిలోని గంగాపురం గ్రామంలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం నాడు రథసప్తమి కావడంతో ఆలయానికి ప్రజలు జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్ణాటక, హైద్రాబాద్, నల్లగొండ, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లా నుండి భారీగా తరలివచ్చారు. గంగాపురం గ్రామం జనసంద్రంగా మారింది. ఆదివారం తెల్లవారుజామున పెద్దతేరు ఉండడంతో ప్రజలు ఆలయానికి భారీగా తరలివస్తున్నారు. ఈ సందర్భంగా జడ్చర్ల సిఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ బలగాలు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి దొంగతనాలు జరగకుండా అలాగే భక్తులకు అసౌకర్యాలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీసులు తమవిధి నిర్వహణ ఖచ్చితంగా పాటిస్తున్నా ఆలయ ఈఓ కానీ ఆలయ సిబ్బంది భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆలయ ఈఓ శ్రీనివాసరాజు ఎవరికి అందుబాటులో ఉండకపోవడమే కాకుండా తన చరవాణిలో సైతం అందుబాటులో ఉండరనే విమర్శలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఈ ఆలయంలోనే పాతుకుపోయిన ఈఓను మార్చి ఆలయ అభివృద్ధికి తోడ్పడే అధికారిని నియమించాలని భక్తులు కోరుతున్నారు.




క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

## దేవస్థానం నిర్మాణానికి విరాళం



**దేవరకద్ర, జనవరి 28 ప్రభాతవార్త:** దేవరకద్రలోని రైల్వేస్టేషన్ ఏరియాలో నూతనంగా నిర్మించే ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానానికి శనివారం గుబ్బ వెంకటేశ్ రూ.51 వేల 516ల విరాళాన్ని అందజేశారు. గత కొన్ని రోజులుగా ఈ దేవాలయం నిర్మాణానికి చాలామంది ముమ్మరంగా విరాళాలు అందజేస్తున్నారు. అందులో భాగంగానే ఈ విరాళాన్ని వెంకటేశ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వేస్టేషన్ ఏరియా యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి



**కోయిల్‌కొండ, జనవరి 28 ప్రభాతవార్త :** బ్యాంకులో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని గ్రామసర్పంచ్ బి. కృష్ణ సూచించారు. శనివారం మండల కేంద్రమైన కోయిల్‌కొండ లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులో స్త్రీనిధి రుణాలు, బ్యాంకు రుణాలు పెండింగ్‌లో పెట్టకుండా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం విజయకుమారి, సిసి కేశవులు, పంచాయతీ కార్యదర్శి రమేష్, విఓఎలు నరేష్, ఇందు, రజిత తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ...



**వీపనగండ్ల, జనవరి 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఎస్ఐ రామన్‌గౌడ్, స్థానిక ఎంపీడీఓ కథలప్ప స్థానిక సర్పంచ్ వంగూరు నరసింహారెడ్డి చేతులమీదుగా ఏవో అగ్రికల్చర్ డాగేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ గీత కార్మికుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బస్వారాజుగౌడ్, గుండ్రాల వెంకటయ్య గౌడ్, రాంబాబు గౌడ్, కృష్ణ గౌడ్, సెక్రటరీ నరేష్ గౌడ్, అమీర్, హోటల్ బస్వారాజు గౌడ్, వెంకటన్న గౌడ్, వెంకటేష్ గౌడ్, శశిధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జమున మృతి కళా రంగానికి తీరని లోటు..

**వనపర్తి టౌన్, జనవరి 28 ప్రభాతవార్త:** అలనాటి హీరోయిన్ అందాల తార మాజీ ఎంపీ జమున రామారావు మృతి కళారంగానికి తీరనిలోటని భారతీయ జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పి.కళావతమ్మ సంతాపం తెలిపారు. శనివారం వనపర్తిలో ఆమె మృతిపట్ల స్పందించి మాట్లాడారు. జమున సీపీఐ అనుబంధ ప్రజానాట్యమండలి నేత ద్వారా కళారంగానికి పరిచయం అయ్యారని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి కోసం ఆహ్వానిస్తే హైదరాబాద్ సీపీఐ కార్యాలయం మగ్దుం భవన్ వచ్చి అందరితో ఆనందం పంచుకుందన్నారు. సినీరంగంలో ఉన్నతశిఖరాలను అందుకోవడం గర్వకారణం అన్నారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన పుల్గర్‌చర్ల గ్రామ యువకులు...



**వీపనగండ్ల, జనవరి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పుల్గర్‌చర్ల గ్రామ యువకులు శనివారం ఉదయం ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డిని సురేందర్ రెడ్డి టీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అదే విధంగా గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే సమస్యలపై స్పందించి గ్రామ అభివృద్ధి కి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## సాగుకు ఎనిమిది గంటలు కరెంట్ కోత సరికాదు..

**వనపర్తి టౌన్, జనవరి28 ప్రభాతవార్త:** సాగుకు రోజు ఎనిమిది గంటలు విద్యుత్‌కోత పెడుతున్నారని ఇది సరికాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.కళావతమ్మ, కె.శ్రీరామ్ అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు సాగుకు 24గంటలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం వనపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ తెల్లవారుజామున 5గంటల నుండి 10గంటల వరకు కరెంటు ఉండదని, సాయంత్రం 5గంటల నుంచి 8గంటల వరకు కరెంటు కోత ఉందని పేర్కొన్నారు. రెండు రెండు విడతల్లో కలిపి 8గంటలపాటు సాగుకు కరెంటు కోత ఉందన్నారు. సాధారణంగా ఈ వేళల్లోనే పొలాలకు రైతులు మోటర్లు పెడతారని గుర్తు చేశారు. రాత్రి 8గంటల నుండి తెల్లవారు జామున 5గంటల వరకు త్రీఫేస్ ఉంటుందని ఇది రైతులకు అనుకూలం కాదన్నారు. కోతలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## రథసప్తమి వేడుకల్లో ఆర్యవైశ్య నేతలు...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 28 ప్రభాతవార్త:** రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం భలాన్‌పల్లి గ్రామంలోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు పాల్గొని ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం గ్రామ సర్పంచ్ అశోక్‌గుప్త ఆధ్వర్యంలో పరిశుద్ధానంద స్వామి ఉపదేశాలను భక్తిగా ఆలకించారు. అనంతరం సంఘం నాయకులు స్వామివారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శివ్వ జగదీశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు మిడిదొడ్డి చంద్రశేఖర్, వీరబొమ్ము సురేష్, పాపిశెట్టి శ్రీనివాస్, చంద్రమోహన్, మిర్యాల రాజయ్య, గుబ్బ కిషన్, ఉప్పు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



## తెలంగాణ విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలి..

**వనపర్తి టౌన్, జనవరి 28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులకు రాష్ట్ర ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వనపర్తి జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర చారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో 250 కోట్ల రూ. ప్రకటించి నేటి వరకు అమలు చేయకపోవడం చాలా దారుణమని ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఫిబ్రవరి 3వ తేదీ నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో విశ్వబ్రాహ్మణ జాతిని గుర్తించి బడ్జెట్లో విశ్వబ్రాహ్మణ జాతికి రూ. 500కోట్లు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా విశ్వబ్రాహ్మణ జాతిలో ప్రసాజ్వామ్య బద్ధంగా ఎన్నుకోబడ్డ సంఘానికి గుర్తించి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని, ఉప్పల్ బాగాఎత్తులో గతంలో ఇచ్చిన 5ఎకరాలు రూ. 5కోట్లు ప్రకటించినట్లు తక్షణమే నిధులు విడుదల చేసి నిర్మాణం చేసే విధంగా చూడాలని, కార్పెంటర్స్ వ్యతిరేకంగా తీసుకొచ్చిన 69జీఓ ను రద్దు చేస్తూ 55జీఓ ను అమలు చేయాలని కార్పెంటర్ల పై ఫారెస్టు అధికారుల వేధింపులు ఆపాలని స్వర్ణకారులపై దొంగ బంగారం పేరుతో పోలీసుల వేధింపులు ఆపాలని లేనిపక్షంలో విశ్వబ్రాహ్మణులు పెద్దఎత్తున అసెంబ్లీ ముట్టడిస్తారని ఆయన హెచ్చరించారు.

## అచ్చుతాపురం గ్రామంలో కంటి వెలుగుపై అవగాహన..

**వనపర్తి రూరల్, జనవరి 28 ప్రభాతవార్త:** వనపర్తి మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో కంటివెలుగు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడుకుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని అచ్యుతాపుర్ గ్రామంలో ఫిబ్రవరి 01వతేదీ నుండి 06వ తేదీ వరకు నిర్వహించే 2వ విడత కంటి వెలుగు కార్యక్రమంలో ముందుస్తు ఏర్పాట్లు చేసుకోని గ్రామ ప్రజలకు ఆహ్వానపత్రికలు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శారద ఆశన్న నాయుడు, పంచాయితీ కార్యదర్శి రత్నమాల, వైద్య ఆరోగ్య సిబ్బంతి గంధం రాజు, గోపాల్ రెడ్డి, విజయలక్ష్మీ, ఆశా కార్యకర్త, అంగన్వాడీ కార్యకర్త, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను వెంటనే మంజూరు చేయాలి..

**కల్వకుర్తి, జనవరి 28 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను వెంటనే పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి. ఆంజనేయులు అన్నారు. గత 6 నెలల క్రితం మున్సిపల్ కార్యాలయం ధర్నా నిర్వహించామని, ఆర్డీఓ కార్యాలయం ముందు 500 మందితో ధర్నా చేశామని, తహసీల్దార్ కార్యాలయం ముందు దీక్షలు చేస్తే సీఎం కేసీఆర్ ఇంటి స్థలం ఉన్న వారికి అర్హులైన పేదలకు ఇండ్లు నిర్మించుకోవడానికి రూ. 3లక్షలుదసరా పండుగ పూర్తయ్యాక ఇస్తానని ప్రకటించి పండుగ అయిపోయి 4 నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు ఎవ్వరికి ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, మల్లయ్య, బాలస్వామి, జగన్, కుర్మయ్య తదితరులు ఉన్నారు.



## గృహహింస, సైబర్ నేరాలు, చట్టాలపై విద్యార్థినిలకు అవగాహన

**బిజినేపల్లి, జనవరి 28 ప్రభాతవార్త :** గృహహింస, వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలపై, చట్టాలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా సచ కేంద్రం నిర్వాహకులు పుట్టపాగ సునిత తెలిపారు. మండలంలోని పాలెంలో కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు శుక్రవారం సచ సేవలపై అవగాహన కల్పించి మాట్లాడారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సచ కేంద్రం 24/7 పని చేస్తుందన్నారు. కేంద్రం ద్వారా కౌన్సిలింగ్, పోలీస్ సహాయం, న్యాయ సలహాలు, వైద్య సేవలు అవసరమున్న బాధతులకు ఐదు రోజుల తాత్కాలిక వసతి, బాధిత మహిళా వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లాలో హింసకు లోనవుతున్న బాధిత మహిళలు ఉంటే ఈ టోల్‌ఫ్రీ నంబర్ 181, సచ ఆఫీస్ నం. 9951940181 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డా. ప్రభాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ డా. ఆసిఫా జహాన్ పాల్గొన్నారు.




## కృష్ణనాయక్ మరణం బిఆర్ఎస్‌కు తీరని లోటు

**బిజినేపల్లి, జనవరి 28 ప్రభాతవార్త :** కిమ్యనాయక్ తండా సర్పంచ్ అంజి భర్త, రేషన్ డీలర్, బిఆర్ఎస్ నాయకుడు అంగోతు కృష్ణనాయక్ హఠాన్మరణం చెందాడని తెలియడంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైనట్లు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, భార్య అంజిని ఓదార్చారు. కృష్ణ నిబద్దత గల నాయకుడని, ఆయన మరణం బిఆర్ఎస్‌కు, గంగారం గ్రామానికి తీరని లోటని అన్నారు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోర్‌రెడ్డి తనయుడు, స్టేట్ డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి నివాళులర్పించి, కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారివెంట మార్కెట్ కమిటి ఛైర్మన్ గంగనమోని కిరణ్, ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, పిఏసిఎస్ ఛైర్మన్ బాలరాజుగౌడ్, మండల రైతు సమితి అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి, మన్నూరి అవంతి, గంగనమోని తిరుపతయ్య, వెంకట్‌స్వామి, గోపినాయక్, చంద్రగౌడ్, డీలర్లు రాజేష్‌శెట్టి, శంకర్, వెంకటేష్‌గౌడ్, మిద్దె రాములు, నరెందర్ తదితరులు ఉన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

**మూసపేట, జనవరి 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు వనితతో కలిసి కరాటే మాస్టర్ సత్యనారాయణ కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పుడున్న సమాజంలో బాలికలకు ఆత్మరక్షణ చాలా అవసరమని తనను తాను రక్షించుకోవడం కోసం ఇలాంటి కరాటే శిక్షణ తీసుకోవాలని అందరు బాగుండాలని, బాలికలకు నెలరోజుల పాటు కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలికలు మనోధైర్యం కోల్పోకుండా చదువుతో పాటు ఇలాంటి కార్యక్రమంలో పాలు పంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి గుపని కళావతి కొండయ్య, సర్పంచ్ సాయిరెడ్డి, ఉపసర్పంచ్ రఘుపతి, విద్యా కమిటి ఛైర్మన్ జయమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పశువులకు నట్టల నివారణపై క్యాంపు నిర్వహణ

**మూసపేట, జనవరి 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సంకల్‌మద్ది గ్రామంలో శనివారం వెటర్నరీ డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో నట్టల నివారణ కార్యక్రమంపై క్యాంపు నిర్వహించారు. రైతులకు కాల్షియం పౌడర్, నట్టల నివారణ మందులు, పశువులకు పునరుత్పత్తికి సంబంధించిన టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ స్వరూప, మండల రైతు సంఘం అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, రైతులు అశోక్‌రెడ్డి, హైమద్ అలీ, ప్రదీప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బాలస్వామి పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామిస్వామి కళ్యాణమహోత్సవం..

### -నేడు జరుగబోయే రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

**దేవరకద్ర, జనవరి28 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ లక్ష్మీ లక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణమహోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుండి ప్రారంభం అయ్యాయి. ప్రతి ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలను పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ముందు వేసిన పచ్చని పందిరిలో స్వామి వారి కళ్యాణమహోత్సవాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. పురోహితుల వేద మంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామశ్చరల మధ్య స్వామిదంపతుల కళ్యాణమహోత్సవాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహించారు. అనంతరం తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహించారు. వివిధ రకాల పూలు, వెండి ఆభరణాల అలంకరణల మధ్య స్వామి దంపతులు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మూలమూర్తికి విశేషపర పంచామృతాభిషేకం, అఖండవచన పూజా కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ విజయలక్ష్మీ, వంశపారంపర్య ధర్మకర్తలు కృష్ణాచారి, శ్రీనివాసచారి, పురోహితులు ప్రాణేశ్‌చారి, సంజీవచారిలతో పాటు పట్టణప్రజలు, భక్తులు, మహిళలు, నిర్వహకులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి..**

దేవరకద్రలోని శ్రీ లక్ష్మీ లక్ష్మీచెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున జరిగే స్వామి వారి మహారథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా రథానికి రంగులు వేసి ముస్తాబుచేశారు. అలాగే స్వామి వారి సన్నిధిలో మహాభిషేకం, అన్నసంతర్పణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వహకులు, దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు కృష్ణాచారి, శ్రీనివాసచారిలతో పాటు అర్చకులు తెలిపారు.

కావున పట్టణం ప్రజలు, భక్తులు, ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.


లక్ష్మీచెన్నకేశవస్వామిస్వామి కళ్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామిదంపతులు

## వికలాంగుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం...

**వనపర్తి టౌన్, జనవరి 28 ప్రభాతవార్త:** వికలాంగుల సమస్యలను అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజనగరం రాజేష్ మాదిగ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కల్పన కొరకు గత కలెక్టర్ శ్వేత మహంతి ద్వారా శానిటరీ నాప్కిప్స్ తయారి యంత్రం డీఆర్‌డీఏ ద్వారా ఇతర ఖర్చులతో 11లక్షల రూ. వ్యయంతో అప్ప గ్రీన్ కంపెనీచే యంత్రం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసి దాదాపు 4 సంవత్సరాలు గడుస్తున్న నేటికి ఈ యంత్రంలో ఎలాంటి ఉపయోగం లేదు ప్రభుత్వం ఎంతో ఉన్నతంగా ఆలోచన చేసి వీరికి స్వయం ఉపాధి నాప్కిప్ తయారీ మిషన్ వినియోగం లేకపోవడంతో ఇప్పటికీ చాల మార్లు వచ్చి పరిస్థితిని అధికారులు చూసిన నిర్లక్ష్యంతోలాభం లేకుండా పోయిందని అన్నారు. వికలాంగులు కాబట్టే వీరిని సంబందిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వికలాంగుల కుటుంబాలు ప్రత్యేకంగా పరోక్షంగా వందల కుటుంబాలు ఈ యంత్రంపై ఆధారపడి ఉపాధి అవకాశాలు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా వనపర్తి దివ్యాంగుల సహాయక సహకార సంఘం వారి యొక్క సమస్యను పరిష్కారించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని యెడల వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేస్తామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కమిటీ పక్షాన హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో గట్టు స్వామ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా నాయకులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా సీనియర్ నాయకులు నారెడ్ల కృష్ణవేణి, నేనావత్ రాంలి, వాకిటి కళ్యాణి, మనోపాడు చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వికలాంగులు

## చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి..

### సీనియర్ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రజిని

**వనపర్తి రూరల్, జనవరి 28 ప్రభాతవార్త:** చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి. రజిని అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి మండలం చిట్యాల మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సేవలు కక్షదారుల సమన్వయంతో కేసులు రాజీ ద్వారా పరిష్కారం చట్టాలపై అవగాహన తదితర కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా వనపర్తి రూరల్ ఎస్ఐ చంద్రమోహన్ రాజు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. క్రమ శిక్షణ, పట్టుదల, కార్యదీక్ష, దేశభక్తి విద్యార్థులతో చిన్ననాటి నుండి అలవాడాలని చెప్పారు. అనంతరం అక్కడ ఉన్న విద్యార్థుల వసతిగృహాన్ని న్యాయమూర్తి రజిని సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయుడు కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, న్యాయవాదికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రజిని

## ఆత్మీయ మిత్రుడికి కన్నీటి వీడ్కోలు..

**బిజినపల్లి రూరల్, జనవరి 28 ప్రభాతవార్త:** ఆత్మీయ మిత్రుడు అంతిమ వీడ్కోలుకు స్నేహితులు శోకసముద్రాలతో అంతిమ వీడ్కోలు పలికారు. బిజినపల్లి మండలం కీమ్యాతాండ గ్రామ సర్పంచ్ భర్త కృష్ణ నాయక్ (40) గుండెపోటుతో శనివారం తెల్లవారుజామున 12.35 గంటల సమయంలో అకాల మరణం చెందడంతో 1996-97 బ్యాచ్ స్నేహితులు తోటి స్నేహితుని మృతిని జీర్ణించుకోలేర శోకసముద్రాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా స్నేహితులు వెంకటేష్ గౌడ్, డా. రామకృష్ణ, గోపాల్, మల్లికార్జున్, సురేష్, అజయ్ మాట్లాడుతూ స్నేహానికి ప్రతిరూపంగా నిలిచి ఏ కార్యక్రమం చేసిన తను ముందుండి సహాయ సహకారాలు అందిస్తూ ముందుండేవాడని జీవితంలో అలాంటి స్నేహితున్ని కోల్పోవడం చాలా బాధాకరమని భావోద్వేగాలతో తనకున్న అనుబంధాలను తలుకుంటు భావోద్వేగంతో అంతిమ వీడ్కోలులో పాల్గొన్నారు. మరుజన్మ అంటే మాకు ఉంటే ఖచ్చితంగా కృష్ణ లాంటి స్నేహితుడు మాకు ఉండాలని ఆపద అంటే నేనున్నానంటూ ముందుకొచ్చి మాకు ఒకే ఒక ధైర్యాన్ని నింపిన స్నేహితుడు కృష్ణ అని అలాంటి స్నేహితుని మేము కోల్పోవడం దురదృష్టకరమని అలాంటి స్నేహితుడు మాకు ఉండడం అదృష్టంగా భావిస్తున్నామని అతని ఆత్మకు ఆ భగవంతుడు ఆత్మ చేకూర్చాలని మనస్పూర్తిగా కోరుకున్నారు.


గుండెపోటుతో మృతి చెందిన కృష్ణ (ఫైల్)

## కష్టపడి కాకుండా.. ఇష్టపడి చదువాలి

- విద్యార్థులకు విషయనిపుణులు, సైకాలజిస్ట్‌ల సూచన
- 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ
- సేవాభారతి అధ్వర్యంలో పరిక్షలపై అవగాహన
- హాజరైన 650మంది విద్యార్థులు

**దేవరకద్ర, జనవరి 28 ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువాలని ప్రముఖ విషయనిపుణులు రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సైకాలజిస్ట్ విశాలాక్షి అన్నారు. దేవరకద్రలో శనివారం మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలమూరు సేవాభారతి అధ్వర్యంలో విద్యార్థులకు పరిక్షలపై ఈ ఒకరోజు అవగాహన శిక్షణసదస్సు నిర్వహించారు. మారిన 10వ తరగతి పరిక్షలపై ఈ అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులకోసం విష్లేశకుల చేత నిర్వహించారు. ఈకార్యక్రమానికి విషయని పుణులు రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సైకాలజిస్ట్ విశాలాక్షిలు ముఖ్యఅతిథిలుగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. పలు సూచనలు, సలహాలను అందజేశారు. పరిక్షలంటే భయపడకుండా చదివింది జ్ఞాపకం ఉంచుకోవడంఎలా అనే అంశాలపై వారు విద్యార్థులకు విశ్లేశించారు. పరిక్షల పై వారికి సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి మండలంలోని దాదాపు 650 మంది 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సేవాభారతి రాష్ట్ర బాధ్యులు సుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు నింగిరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, విభాగ్ ప్రచారక్ శివశంకర్, ఉపాధ్యాయులు తిప్పారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా సంపర్క్ ప్రముఖ్ వర్కుటి నిరంజన్‌రెడ్డి, సునిల్‌కుమార్, బాబునాయుడు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో ఉపాధ్యాయులతో విషయనిపుణులు, సైకాలజిస్ట్‌లు

## వెంకటాద్రి బాధితులకు న్యాయం చేయాలి

**జడ్చర్ల, జనవరి 28 ప్రభాతవార్త :** ఇటీవల జడ్చర్ల మండల పరిధిలోని మాచారం శివారులో గత ముప్పై సంవత్సరాలక్రితం ఏర్పాటు చేసిన వెంకటాద్రి వెంచర్ కబ్జాకు గురైన విషయం పాఠకులకు తెలిసిందే. అయితే వెంచర్‌లో ప్లాట్లు కోల్పోయిన బాధితులకు ఇప్పటివరకు ఎలాంటి న్యాయం చేయకపోవడంతో శనివారం బిజెపి నాయకులు, మండల తహసిల్దార్‌కు, ఉప తహసిల్దార్ వెంకటేశ్వరమ్మకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు కొంగలి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్లాట్స్ కొనుగోలు చేసిన ప్రజలకు అన్యాయం చేయవద్దని అన్నారు. ధరణిలో ఉన్న లోపాల వల్ల ప్లాట్లుగా ఏర్పడ్డ వెంచర్లను వెంటనే క్రమబద్దీకరణ చేయాలని ఎన్నో పేద కుటుంబాలకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఈ విషయంపై స్పందిస్తూ దీనిపై పూర్తి విచారణ చేసి న్యాయం చేస్తామని తహసిల్దార్ కార్యాలయం అధికారులు హామీ ఇచ్చారన్నారు. లేనిపక్షంలో బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## ఉపాధ్యాయ బదిలీల్లో జీరో సర్వీసు అమలు చేయాలి..

**వనపర్తి టౌన్, జనవరి 28 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ బదిలీల్లో జీరో సర్వీసు అమలు చేయాలని యుఎస్‌పీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు శనివారం వనపర్తి డీఈఓ రవీందర్‌కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. 317 జీవోలో స్పౌజ్ బాదితులకు లాంగ్వేజ్ పండితులకు, ఎస్టీలకు బది లీలో అవకాశం కల్పించాలని, బదిలీలో అక్రమాలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రవి ప్రసాద్ గౌడ్, ప్రదాన కార్యదర్శి డి. కృష్ణయ్య డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, ప్రదాన కార్యదర్శి చిన్నరాములు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. వెంకటనారాయణ, యుఎస్పీసీ నాయకులు బక్కన్న, తిమ్మప్ప, వెంకటేష్, లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేసిన రవీందర్‌రావు

**వెల్దండ, జనవరి 28 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కొట్రగ్రామంలోని హన్మంతు మల్లమ్మ మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులను కొట్ర గ్రామ సేవా సమితి అధ్యక్షులు పొనుగోటి రవీందర్‌రావు పరామర్శించి సేవా సమితి ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, 9 రకాల నిత్యావసర వస్తువులను అందించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాగరాజు గౌడ్, కొండల్‌రావు, కదారి రవీందర్, మల్లేష్, వెంకటయ్య, నరసింహ, వీరేందర్, రామస్వామి, సహదేవ్, యాదయ్య, ఎల్లయ్యతో పాటు తదితరులు ఉన్నారు.



## ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్ బహుకరణ...

**కల్వకుర్తి, జనవరి 28 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రజలు హితోదికంగా పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న దాన్ని చూసి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా తమ వంతుగా పాఠశాలకు ఏదైనా చేయాలనే తపనతో వారి జీతాల నుంచి డబ్బులను గ్రామంలోని పాఠశాలకు అందించారు. పుష్పలత టీచర్ రూ. 10 వేలు, ఉమాదేవి రూ. 5వేలు కలిపి మొత్తం రూ. 15వేలు విలువ చేసే ప్రింటర్, జిరాక్స్ మిషన్‌ను బహుకరించారు. పాఠశాలకు ఉపాధ్యాయులు తమ వంతుగా బహుకరించడంతో గ్రామస్తులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.



## పలు వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

**గద్వాల టౌన్, జనవరి 28 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గంలోని పలు వివాహ వేడుకలకు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి హాజరయ్యారు. నూతన వధూవరులకు పెళ్లి కానుకను అందజేసి వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు రాధమ్మ, తెరాస పార్టీనాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## ఘనంగా గద్వాల జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ ప్రమాణ స్వీకారం



**గద్వాల టౌన్, జనవరి 28 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా మార్కెట్ కమిటి ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం జోగులాంబ గద్వాల జిల్లా మార్కెట్ కమిటి ఛైర్మన్‌గా పచర్ల శ్రీధర్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లు హాజరుకాగా ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం, జిల్లా ఛైర్మన్ సరిత, మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, కౌన్సిలర్లు మార్కెట్ యార్డు మెంబర్లు, జడ్పీటిసిలు, ఎంపిటిసిలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అభయుడి సన్నిధిలో ఆర్యవైశ్య మహాసభ నేతలు...

**ఊర్కొండ, జనవరి 28 ప్రభాతవార్త:** రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఊర్కొండ మండల పరిధిలోని ఊర్కొండపేట శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర వ్యైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు పాల్గొని ప్రత్యేక పూజలు గావించారు.



అనంతరం గ్రామ సర్పంచ్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శివ్వ జగదీశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు మిడిదొడ్డి చంద్రశేఖర్, వీరబొమ్ము సురేష్, పాపిశెట్టి శ్రీనివాస్, చంద్రమోహన్, మిర్యాల రాజయ్య, గుబ్బ కిషన్, ఉప్పు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## క్రీడా రంగంలో ఉజ్వల భవిష్యత్తు...

**కల్వకుర్తి, జనవరి 28, ప్రభాతవార్త:** క్రీడా రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉందని, క్రీడల వల్ల శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని టీఎన్జీఓ హౌసింగ్ సొసైటీ సెక్రటరి ఆర్.వెంకట్ రాం రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణంలోని టీఎన్జీవో సొసైటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఫ్రెండ్లీ షెటిల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి టీఎన్జీఓ హౌసింగ్ సొసైటీ సెక్రటరి ఆర్.వెం కట్‌రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని ఫైనల్ మ్యాచ్‌ను ప్రారం భించారు. ఫైనల్ మ్యాచ్‌లో ఆంజనేయులు లక్ష్మీనరసింహారావు, కిషన్‌రెడ్డి రహీం జట్లు తలపడ గా మొదటి స్థానంలో కిషన్‌రెడ్డి జట్టు, ద్వితీయస్థానంలో లక్ష్మీనరసింహారావు జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా ఆర్.వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ క్రీడలు స్నేహబంధాన్ని పెంపొందిస్తాయని, ప్రస్తుత కాలంలో శారీరక శ్రమ తగ్గిపోయిందని, శ్రమను పెంపొందించడంలో క్రీడలు ఎంతో తోడ్ప డుతాయన్నారు. అనంతరం విజేతలకు ఆర్.వెంకట్‌రాంరెడ్డి, డైరెక్టర్ల చేతుల మీదుగా బహుమ తులను ప్రధానం చేశారు. ముగింపు వేడుకలకు విచ్చేసిన అతిథులను ఫ్రెండ్లీ షెటిల్ టోర్నమెంట్ నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ డైరెక్టర్లు ప్రసాద్, గౌరవ సభ్యులు బాల్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసాచారి, రంగారావు, చంద్రశేఖర్, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.



## కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, వర్టికల్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలోని కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, ఇతర వర్టికల్ సిబ్బందికి ఎస్‌హెచ్‌ఓ సమక్షంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్ విచారణ (ట్రయల్)లోని సమయంలో కోర్టుడ్యూటీ ఆఫీసర్ సమర్థవంతంగా ఇన్వెస్టిగేషన్, ప్రాసిక్యూషన్, సమన్స్ డ్యూటీ ఆఫీసర్, వారంట్ డ్యూటీ ఆఫీసర్స్, కోర్టులోని వివిధ అధికారులను సమన్వయపరుస్తూ సాక్షులు, నిందితులు కోర్టులో హాజరై విధులు నిర్వర్తించి తద్వారా కేసుల విచారణ త్వరితగతిన విజయవంతంగా పూర్తి అయ్యేందుకు దోహదపడాలని కోర్టు డ్యూటీ ఆఫీసర్ సమర్థవంతంగా వ్యవహరించడం వల్ల నిందితులకు సరైన రీతిలో శిక్షలు పడటానికి దోహదపడిన వారై సకాలంలో బాధితులకు న్యాయం జరిగేందుకు ఆస్కారం కల్పించిన వారవుతారని అలాగే పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం, గౌరవం పెరగడానికి తమవంతు పాత్ర విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కోర్టుడ్యూటీ ఆఫీసర్ ఇన్వెస్టిగేషన్ సమయంలో ఎఫ్ఐఆర్ కాపీని ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కోర్టులో సమర్పించి తదుపరి కోర్టుకు ఎఫ్ఐఆర్ కాపీ సబ్మిట్ అయింది లేనిది ప్రతిరోజు చెక్ చేసుకుంటూ ఉండాలని, కేసు పురోగతి నివేదికలను పార్ట్ 2 స్టేట్మెంట్స్‌ని, సీజ్ చేసిన వస్తువులను ఎప్పటికప్పుడు కోర్టులో సమర్పించాలని సూచించారు. చార్జీషీట్లు, రిమాండ్ నివేదికలను కోర్టులో సమర్పించాలని, విచారణ సమయంలో చార్జిషీట్ ఫైల్ చేసిన తర్వాత ఫైల్ వెరిఫై చేసే కోర్టు సిబ్బందికి సహకరించి సిసి నంబర్లు పొందాలని తెలిపారు. కోర్టువారు జారీచేసే నాన్ బెయిలుబుల్ వారెంట్లను క్రమం తప్పకుండా తీసుకోవాలని, ప్రతిరోజు కోర్టు నుండి తీసుకునే సమన్లు ప్రాసెస్ రిజిస్టర్‌లో నమోదుచేసి సమన్స్ ఆఫీసర్లకు అందజేయాలని తెలిపారు. ప్రతి శనివారం పోలీస్ స్టేషన్‌లో గల ఎస్‌హెచ్‌ఓ, ఐఓలు, సిబ్బందితో ఆ వారంలో కోర్టులో జరిగిన కేసులలో పడిన శిక్షలు, వీగిపోయిన కేసులో లోపాలను చర్చించాలని తెలిపారు.

## మృతుడు అడివన్న కుటుంబానికి ఆర్థిక సాయం..

**వనపర్తి ప్రతినిధి(మదనాపురం), జనవరి 28 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం మదనాపురం మండల జడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ శనివారం మదనాపురం మండలం రామన్‌పాడు గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ అడివన్న మృతి చెందాని తెలుసుకొని ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి సంతాపం తెలిపి ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సూచన మేరకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు రామన్‌పాడు సర్పంచ్ కురుమూర్తి, మదనాపూర్ మండలం మార్కెట్ డైరెక్టర్ సత్యం యాదవ్, రామన్‌పాడు వార్డు మెంబర్ మండల బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాష, మండల బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గన్నెపల్లి మనోజ్ కుమార్, మండల సీనియర్ నాయకులు ఖాజామైనుద్దీన్, వెంకటస్వామి ఉన్నారు.

## మన ఊరు మన బడి
## అభివృద్ధి పనులు పూర్తి త్వరలోనే ప్రారంభిస్తాం..

**మొక్కలు నాటిన ఎంపీడీఓ అప్జల్, ఇన్చార్జి జయశంకర్..**

**పెద్దమందడి, జనవరి 28 ప్రభాతవార్త:** మన ఊరు మన బడి లో భాగంగా మండలంలోని వీరయపల్లి, చిన్నమందడి గ్రామాలలో పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తయినట్లు వెంటనే ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ అప్జల్, ఇన్చార్జి జయశంకర్ తెలిపారు. శనివారం వీరాయపల్లి, చిన్నమందడి లో మన ఊరు మన బడి లో భాగంగా పాఠశాలలను సందర్శించే అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరలోనే ప్రారంభిస్తున్నట్లువారు తెలిపారు. దీనిలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి అందరు సహకరించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మెరుగుపరిచేందుకు మన ఊరు మన బడి కార్యక్రమం నిర్వహించేపాఠశాలల అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా ఉంటాం...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 28, ప్రభాతవార్త:** జర్నలిస్టులకు అండగా ఉంటామని, ప్రభుత్వం ద్వారా అందించే పథకాలను వారికే దక్కే విధంగా కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో టీయూడబ్ల్యూజే హెచ్-143 ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించి కలెక్టర్ ఉదయ్‌కుమార్ జర్నలిస్టులతో ముచ్చటించారు. టీయూడబ్ల్యూజే హెచ్-143 ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలు ఫిబ్రవరి 5వ తేదీన నిర్వహిస్తున్నామని, ఇట్టి కార్యక్రమానికి కలెక్టర్ ఉదయ్‌కుమార్ అతిథిగా రావాలని టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లాఖాన్ ఆహ్వానించారు. ఫిబ్రవరి 5వ తేదీన నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలకు మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నారని కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కేఎస్.సురేష్, చంద్రశేఖర్‌రావు, రాజేష్‌గౌడ్, ఖానాపురం ప్రదీప్, వెంకటస్వామి, అహ్మదుల్లాఖాన్‌తో పాటు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఉన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**గండీడ్, జనవరి 28 ప్రభాతవార్త :** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డిఆర్‌డిఎ పిడి యాదయ్య అన్నారు. శనివారం మండల ఎంపిడిఓ కార్యాలయంలో సాంకేతిక సహాయకులకు ఈజిఎస్ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు గైర్హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మహ్మదాబాద్ మండలంలోని ముకర్లబాద్ నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రూపేందర్‌రెడ్డి, ఎపిఓ హరిశ్చంద్రుడు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని
## పరామర్శించి ఆర్థిక సహాయం అందజేత

**లింగాల, జనవరి 28 ప్రభాతవార్త :** గతవారం రోజుల క్రితం మృతి చెందిన మల్లేష్ కుటుంబాన్ని శనివారం అచ్చంపేట అసెంబ్లీనేత దేవని సతీష్ మాదిగ పరామర్శించి రూ. 5 వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబాన్ని పోషించే యువకుడు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. మృతిచెందిన మల్లేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రేణయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు యాదగిరి, సలేశ్వరం, బిజెపి కార్యవర్గ సభ్యులు విష్ణుచారి, సైదులు, అశోక్, కృష్ణయ్య, అంజి, అచల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

# కంటి వెలుగులో సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28 ప్రభాతవార్త :** కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా మెడికల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కంటి వెలుగు కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి పదిరోజులు అవుతుందని, ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. కంటి పరీక్షలకు వచ్చిన ప్రతి ఒక్కరి వివరాలను ముందుగా రిజిస్టర్ చేయాలని అన్నారు. పరీక్ష అనంతరం వారికి కావాలసిన కంటి అద్దాలను అక్కడే అందించాలని సూచించారు. దగ్గరి చూపుతోపాటు, దూరపు చూపు సమస్య ఉన్నవారిని గుర్తించి వారికి సరైన కంటి అద్దాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసి అద్దాల తయారీకి పంపించాలన్నారు. రోజుకు 130 నుండి 140 మందికి కంటి పరీక్షలు నిర్వహించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. వైద్య శిబిరానికి కంటి పరీక్షల నిమిత్తం అధిక సంఖ్యలో తరలి రావడానికి ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని నిర్దేశించారు. కంటి పరీక్షకు వచ్చిన వారిని మూడు మీటర్ల దూరం నుంచి నిర్వహించే చూపు పరీక్షను సజావుగా నిర్వహించాలన్నారు. లేనిపక్షంలో కంటి పరీక్షల వ్యాల్యుయేషన్‌లో తేడాలు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. కంటి పరీక్షకు వచ్చిన వారికి అవసరమైన అద్దాలతో పాటు మందులు సైతం ఇవ్వాలని సూచించారు. కంటి పరీక్షకు వచ్చిన తరువాత కంటి దగ్గరి చూపు అద్దాలు అక్కడికక్కడే ఇవ్వాలని, దూరపు చూపు అద్దాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని అవి వచ్చాక ఎవరి అద్దాలు వారికే ఇవ్వాలని సూచించారు. అందుకే దూరపు చూపువారి వివరాలను అప్పటికప్పుడు ట్యాబ్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి ఉదయం 9 గం.లకు శిబిరం ప్రారంభమయ్యే విధంగా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, మెడికల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమావేశానికి హాజరైన అధికారులు

# విద్యార్థులకు ఎవరెస్ట్ పర్వతారోహణ రెండో రోజుల శిక్షణ విజయవంతం..

**జిల్లా వెనుకబడిన తరుగుతుల సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 28 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, సామాజిక గౌరవం పెంచే లక్ష్యంతో ఎవరెస్టు టాస్క్‌లో పాల్గొనేందుకు పర్వతారోహణ శిక్షణను బీసీ విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేసినట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్ సూచించారు. శనివారం భువనగిరి జిల్లా వేదికగా నాగర్‌ర్నూల్, వనపర్తి జిల్లాల బీసీ సంక్షేమ శాఖ వసతిగృహాల విద్యార్థినిలకు నిర్వహిస్తున్న ఎవరెస్టు పర్వతారోహణ శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వెనుకబడిన తరగతుల వసతిగృహాల విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, సామాజిక గౌరవం పెంచే లక్ష్యంతో ఎవరెస్టు టాస్క్ పర్వతారోహణ రెండు రోజుల శిక్షణ శుక్రవారం ప్రారంభమై శనివారం విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణకు నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల నుండి 100మంది బాలికలు రెండు రోజుల పాటు శిక్షణలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి వసతి గృహాల విద్యార్థులను ఎంపిక చేసి మొత్తం 2600మంది బాల బాలికలకు రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి భువనగిరి రాక్ క్లైబింగ్ స్కూల్ పర్యవేక్షణలో భువనగిరి జిల్లాపై పర్వతారోహణలో రెండు రోజుల శిక్షణ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నదని ఆయన తెలిపారు. వసతి గృహాల విద్యార్థులను వివిధ రంగాల్లో తీర్చిదిద్దేందుకు ఎవరెస్ట్ టాస్క్ తో సాహస క్రీడల్లో అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల్లో సామర్థ్యం ఆధారంగా శిక్షణలో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన విద్యార్థులకు భారత సైన్యం పర్యవేక్షణలో మంచు పర్వతాల అధిరోహణపై శిక్షణ అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆ శిక్షణలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు ఎవరెస్ట్ టాస్క్ కు ఎంపికవుతారని ఆయన తెలిపారు. బాలురకు ఈనెల 30,31వ తేదీలలో రెండు రోజుల పాటు శిక్షణ కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాకు చెందిన బీసీ వసతి గృహాల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండేలా కృసి చేస్తున్నట్లు ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో బీసీ సహాయ సంక్షుమ అధికారి శ్రీధర్, వసతి గృహాల వార్డెన్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు బయలుదేరిన బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థినిలు



పర్వతారోహణపై శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

# కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు..

**- ప్రజల పాలిట శాపంగా మారిన ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తాం...- మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎర్ర శేఖర్**

**ఊర్కొండ, జనవరి 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని తెలంగాణ సర్కార్ ప్రజా రంజక పాలన సాగిస్తుందని, కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుభిక్షమైన, సురక్షితన పాలన అందించామని మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎర్ర శేఖర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాధారం గ్రామ సర్పంచ్ ధ్యాప నికిల్‌రెడ్డితో కలిసి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎర్ర శేఖర్ మాట్లాడుతూ దేశసంపదను కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతుందని ఆయన దుయ్యబట్టారు. జడ్చర్ల నియోజకవర్గంలో భూ ఆక్రమణలు పెట్రేగిపోతున్నాయని, బీఆర్ఎస్ నాయకులు దళితులు, పేద వర్గాల భూములు ఆక్రమించుకొని అక్రమ సంపాదనకు తెరలేపారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రశ్నించే వారిపై దాడులు చేయడానికి కూడా వెనుకాడటం లేదని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ హయాంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేదలకు భూములు పంచితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరణి పేరుతో వారి నుంచి భూములను లాక్కుంటున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో విఫలమైందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులు అక్రమాలు తప్ప ఎలాంటి అభివృద్ధి లేదని, ఊర్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ, దేవాలయ భూములను ఆక్రమించుకొని వెంచర్ ఏర్పాటు చేశారని, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం పరిపాటిగా మారిందని, ఇలాంటి పరిస్థితిలో గతంలో ఎన్నడు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎర్ర శేఖర్

**మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు...** ఊర్కొండ మాజీ ఎంపీటీసీ సభ్యులు మ్యాకల సహాదేవ్ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ సహాదేవ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మాధారం గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధ్యాప నికిల్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

# నిత్యావసర సరుకుల పంపిణీ

**అలంపూర్, జనవరి 28 ప్రభాతవార్త :** కొత్త రాజోలు మండలం, రాజోలి గ్రామంలో మండల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ డాక్టర్ మధుబాబు సమక్షంలో రాజోలి చేనేత శ్రామిక సేవా సమితి ఎన్‌జిఓస్ ఆధ్వర్యంలో దాతలైన జడ్పీ జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండి నిసాక్, సమితి సభ్యులు దర్జి వీరేష్, మాన్ దొడ్డి హుసేన్, జంగం హోటల్ శివరామయ్యలు కలిసి 97 మంది క్షయవ్యాధిగ్రస్తులు ఉండగా తమవంతు చిన్న సహాయంగా అందులో నిరుపేద కుటుంబాలకు సంబంధించిన 13 మంది క్షయ వ్యాధిగ్రస్తులను ఎంచుకుని వారిని ఆరునెలల పాటు దత్తత తీసుకోవడం జరిగింది. ప్రతినెలా విడతల ప్రకారం వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేయడం జరుగుతుంది. శనివారం రెండో విడతగా భాగంగా నిత్యావసర సరుకులు కందిపప్పు, గోధుమపిండి, ఉప్మారవ్వ, చక్కెర, టీపొడి, చింతపండు, బ్రెడ్ టోస్ట్ ప్యాకెట్, బిస్కెట్ ప్యాకెట్లు, సబ్బులు పది రకాల వస్తువులను కిట్లరూపంలో తయారు చేసి డా. మధుబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు నిసాక్, చేనేత శ్రామిక సేవా సమితి సభ్యులు దర్జి వీరేష్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి మిగతా క్షయవ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు దత్తత తీసుకుని నిత్యావసర సరుకులు ప్రతినెల అందించడానికి మరికొంత మంది దాతలు ముందుకు వస్తే వారి కుటుంబాలకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చే వాళ్లవుతారని మానవ సేవే మాధవ సేవగా భావించానలి అన్నారు. కార్యక్రమంలో వైద్యులు డా. రామకృష్ణ, టిబి వ్యాధిగ్రస్తుల మండల సూపర్‌వైజర్ జయప్రకాష్, అల్వాల శాంతయ్య, టైలర్ శ్యామ్, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



క్షయవ్యాధి గ్రస్తులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

## కేజిబివి నాన్‌టీచింగ్ వర్కర్స్ రెగ్యులరైజేషన్‌కై జనవరి 30న ఛలో ఎస్పీడి జయప్రదం

**అలంపూర్, జనవరి 28 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రగతిశీల కెజిబివి నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో జనవరి 30న హైదరాబాద్‌లో ఉన్న ఎస్‌పిడి కార్యాలయం ముందు రాష్ట్రస్థాయి ధర్నాను జయప్రదం చేయాలని అయిజ, వడ్డేపల్లి, రాజోలి కెజిబివి ముందు పోస్టర్, కరపత్రం రిలీజ్ చేయడం జరిగింది. ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి జమ్మిచేడు, కార్తీక్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు హలీమ్‌పాషాలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్న కెజిబివిలో పని చేస్తున్న నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ చాలాకాలంగా కార్మికులను బానిసలుగా పని చేయించుకుంటూ కనీస వేతనాలు అమలు చేయని పరిస్థితి ఉంది. ఉద్యోగులకు భద్రతలేని పరిస్థితి, రోజుకు 12 గంటలు పని చేయించుకుని, సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పుల్ని గౌరవించని ప్రభుత్వాలు మనల్ని పాలించడం సిగ్గుచేటన్నారు. అందరిని పర్మినెంట్ చేయాలని, కనీస బేసిక్ వేతనాన్ని నిర్ణయించాలని, కనీస సౌకర్యాలు వర్కర్స్‌కి కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్లందరిని పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి మాత్రమే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు కెజిబివిలలో పని చేస్తున్న నాన్‌టీచింగ్, వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెజిబివి వర్కర్లు సుధా, సుభాషిణి, మహేశ్వరి, భూదేవి, యశోద, ఆశాబీ, మాధవి, అనోద, అనురాధ, జయమ్మ, మార్తమ్మ, జ్యోతి, గౌతమి, అరుణ, రత్నమ్మ, లక్ష్మిదేవి, శ్వేతా తదితరులు పాల్గొన్నారు.

**వరికొనలు తుంచి నాటుట ద్వారా**

## పురుగు నివారణపై రావేష్ విద్యార్థుల ప్రదర్శన

**తెల్కపల్లి, జనవరి28 ప్రభాతవార్త :** పరిసాగులో వరికొనలు తుంచి నాటడంవల్ల పైరుకు పురుగు నివారణ జరిగి అధిక దిగుబడులు సాధ్యమవుతుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం రావేష్ విద్యార్థిశరణ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని కార్వంగ గ్రామంలో రావేష్ కార్యక్రమంలో భాగంగా భాస్కర్‌రెడ్డి అనే రైతు పొలంలో వరిపంటలో వరికొనలు త్రుంచి నాటే పద్దతి, వరివేర్లు తడిపి నాటే పద్దతిపై ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వరికొనలు త్రుంచి నాటే పద్దతి వలన వరినారు కొనలో ఉండే కాండం తొలిచే పురుగు గుడ్లను తొలగించడం ద్వారా పంట త్వరగా పెరిగి, పంట తొలిదశలో కాండం తొలిచే పురుగురాకుండా పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. వరి వేర్లను తడిపి నాటే పద్దతిలో క్లోరోపైరిఫాస్ ఎకరాకు 80 మి.లీ.ను 40లీటరు నీటిలో కలిపి అట్టి ద్రావణంలో వరినారును 15,20 నిమిషాలు ఉంచి నాటడం వల్ల ఉల్లికోడు పురుగును నివారించవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రావేష్ విద్యార్థులు పూజ, శరణ్య, వైభవి, జైనాబ్ రైతులు రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆనంద్, శైలమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైని సన్మానించిన మండల నాయకులు

**మూసపేట, జనవరి 28 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో 26 జనవరిని పురస్కరించుకుని రెండు రోజుల క్రితం పౌరసేవలో మూసపేట పోలీస్ స్టేషన్ తెలంగాణలో మూడోస్థానం లభించడం పట్ల మండల నాయకులు ఎస్సై నరేష్‌ను శనివారం సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బగ్గి కృష్ణయ్య, కొమిరెడ్డిపల్లి సర్పంచ్ సాయిరెడ్డి, వేముల ఎంపిటిసి యాట సత్యనారాయణ, గద్వాల తిరుపతిరెడ్డి, వెంకటయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## హాజిలాపూర్‌లో పోలీసుల
## కమ్యూనిటీ కనెక్ట్ 10 వాహనాలు సీజ్

**దేవరకద్ర, జనవరి 28 ప్రభాతవార్త :** దేవరకద్ర మండలం, హాజిలాపూర్‌లో శనివారం పోలీసులు కమ్యూనిటి కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ నరసింహ ఆదేశానుసారం పోలీసులు ఈ కార్యక్రమం నిర్వహించారు. సీఐ రజితారెడ్డి, ఎస్సై భగవంతరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 37 మంది పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా 74 ఇండ్లను పోలీసులు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 10 వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్సై భగవంతరెడ్డి తెలిపారు.



## 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం..



**పాన్‌గల్, జనవరి 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జడ్పీటీసీ లక్ష్మీ చంద్రశేఖర్ నాయక్ తన సొంత ఖర్చులతో శనివారం అల్పాహారం ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం టెన్త్ విద్యార్థులు అదనపు క్లాసుల నిమిత్తం పాఠశాలకు రావడంతో ప్రత్యేకంగా వారికోసం అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి ఏటా దాతలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం జడ్పీటీసీ తన వంతు సహకారంతో ఈ ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దంపతులను ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

IN THE COURT OF IX ADDITIONAL CHIEF JUDGE: CITY CIVIL COURT: AT HYDERABAD
G.O.P. NO. 2 OF 2023

Between:
1. Smt. G. Durga Bhavani
2. Baby G. Prashanthi
3. Master G. Ram Teja ...PETITIONERS
AND
All Concerned ...RESPONDENTS

TO
All Concerned

TAKE notice that (1) Smt. G. Durga Bhavani, (2) Baby G. Prashanthi and (3) Master G. Ram Teja have filed the above O.P. seeking permission to sell 2/3rd undivided share of Baby G. Prashanthi and Master G. Ram Teja in agrl, Land adm. 2-05 acres in Sy.No.360A of Rajapur Village and Mandal, Mahaboob Nagar and also to transfer 2/3rd undivided share in 150 Sq.yards of UDS at H.No.17-1-386/1/55, on plot No.55, Keshava Nagar Colony, Saidabad, Hyderabad. NOW the above case stands posted to 02.03.2023 for objections, if any. AS such if any person has got any objection in respect of the above properties and or matter, is required to be present before the Hon'ble Court on 02.03.2023 at 10.30 A.M. Otherwise the matter will be proceeded further.

(BY ORDER OF THE COURT)
M. KESHAVA RAO, Advocate
H.No.1-5-817/3, Road No.3B, New Maruthi Nagar, Kothapet, Hyderabad-500060. Mobile: 9246536476